క్లుప్తంగా

రూ.40 లక్షలతో ఇంటింట కుళాయిల పనులు


జేసీబీతో పైపులైన్ కోసం చేపడుతున్న తవ్వకాలు

వేపాడ: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని శింగరాయి గ్రామంలో రూ.40 లక్షలతో ఇంటింట కుళాయి ల ఏర్పాటు పనులు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి తెలిపారు. పైపులైను తవ్వకాల పనులను జేసీబీ సహాయంతో మంగళవారం చేపట్టారు. ప్రతీ ఇంటికి రక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇంటింటికి తాగునీటి కుళాయి సౌకర్యం కల్పిస్తోందని ఆమె చెప్పారు.

దత్తిరాజేరు తహసీల్దార్‌గా సుదర్శనరావు


తహసీల్దార్ సుదర్శనరావును కలిసిన రెవెన్యూ ఉద్యోగులు

దత్తిరాజేరు: మండల తహసీల్దార్‌గా సుదర్శనరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్‌కు డీటీ రమేష్, మండల సర్వేయర్ సత్యం, వీఆర్‌ఓలు పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

గురుకుల పాఠశాల సందర్శన


వంటకాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వరి

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస వద్ద ఉన్న మహత్మ జ్యోతిబాపూలే బాలురు గురుకుల పాఠశాలను జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి సోమవారం సందర్శించారు. తరగతి గదులు, పాఠశాలలో సదుపాయాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూశారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో సదుపాయాలు ఎలా ఉన్నాయి, భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు బాగున్నాయని విద్యార్థులు జెడ్పీటీసీకి చెప్పారు.ఆమె వెంట ప్రిన్సిపాల్ సీతారాం, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీమా తక్షణ సహాయం అందజేత

జామి: మండలంలోని భీమసింగి గ్రామానికి చెందిన బి.వెంకటరమణ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతుడు భార్య వరలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా సచివాలయ కన్వీనర్ మజ్జి హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ సింగారపు అప్పలరాజు, జొన్నాడ సత్యంనాయుడు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

25 నుంచి రాష్ట్ర మహాసభలు

మెంటాడ(గజపతినగరంరూరల్): గుంటూరు జిల్లా బాపట్లలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను 25,26,27వ తేదీల్లో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వ్యవసాయకార్మిక సంఘం అధ్యక్షుడు పురం అప్పారావు పిలుపునిచ్చారు. సంబంధిత గోడపత్రికలను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. సాగుభూములు, సామాజిక న్యాయం తదితర అంశాలపై మహాసభ ల్లో చర్చించనున్నామని, రైతులు,కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం బొండపల్లి మండల అధ్యక్షుడు పి.కృష్ణబాబు, సభ్యులు జి.దేవుడు, సన్నిబాబు పాల్గొన్నారు.


నేటి నుంచి ఉక్కు రక్షణ యాత్ర


ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అప్పారావు, తదితరులు

కొత్తవలస: ఈ నెల 20వ తేదీ నుంచి 29 వరకు విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై ఉక్కు రక్షణ యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు తెలిపారు. సంబంధిత గోడపత్రికలను మండల కేంద్రంలోని సబ్బవరం రోడ్డులో కలాసీలతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఉద్యమించాలని కోరారు. 32 మంది ప్రాణత్యాగాలతో,16 వేల మంది రైతులు సుమారుగా 22 వేల ఎకరాలను భూత్యాగ ఫలితంతో ఏర్పడిని స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడం తగదన్నారు. మోదీ ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు ఉక్కు రక్షణ యాత్ర చేపడుతున్నామన్నారు. కలాసీలు దావాల కన్నంనాయుడు,జెక్కాన దేముడు,జెక్కాన చిన్న,మెంటు సత్యం తదితరులు పాల్గొన్నారు.

బోలో గణేశ్ మహరాజ్‌కీ జై


శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని కాపువీధిలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహం


చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని రామేశ్వరం కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడు


బొండపల్లి: కొవ్వాడపేటలో ఏర్పాటు చేసిన మండపంలో నందీశ్వరుడిపై వినాయకుడు


కొత్తవలస: తుమ్మికాపల్లిలో తిరుమల శ్రీవారి ఆలయం నమూనాలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలు చేస్తున్న భక్తులు


వేపాడ: నీలకంఠరాజపురంలో పూజల్లో పాల్గొన్న యువత


జామి: కుమరాం ఐశ్వర్యలక్ష్మీ ఆలయంలో పూజలందుకుంటున్న గణనాథుడు


దత్తిరాజేరు: గడసాం శివాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలు


వేపాడ: వేపాడలో గణనాథుడుకి పూజలు చేస్తున్న భక్తులు


గజపతినగరం: గజపతినగరంలో శ్రీరామదూత యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో భక్తుల పూజలు


లక్కవరపుకోట: ఎల్.కోట బీసీ కాలనీలో గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు

వినాయక చవితి వేడుకలను గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలు, ఇళ్లలో ప్రజలు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. యువత మండపాలను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు చేసేందుకు భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండపాల సెట్‌లు, విద్యుత్ దీపాల అలంకరణ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. – సాక్షినెట్ వర్క్


బొండపల్లి: గొట్లాంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం


చీపురుపల్లి: జి.అగ్రహారంలో శివలింగం, విష్ణుమూర్తి, ఆంజనేయస్వామి అవతారం కలిసి ఉన్న వినాయక విగ్రహం


చీపురుపల్లి: జి.అగ్రహారంలోని వినాయక మండపం వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు,తదితరులు


చీపురుపల్లి రూరల్: మెట్టపల్లి గ్రామంలో కారు ఆకారంలో వేసిన మండపం సెట్


గుర్ల: గుర్లలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న యువకులు

పేదల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా పథకాలు


మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: పేద ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో 'గడప గడప కు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వినాకయ చవితి పండగరోజు కూడా ఎమ్మెల్యే ప్రజల మధ్యే గడిపారు. జోరు వానలోనూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ఆయా పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలు తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అంతా ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఏదోఒక విధంగా గద్దెనెక్కాలని టీడీపీ కుట్రలు పన్నుతోందని, వారి మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఒబ్బిన నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, స్థానిక సర్పంచ్ విరోతి కొండలరావు, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, నాయకులు ఈశ్వరరావు, పిల్లా అచ్చులు, అప్పికొండ సన్యాసిరావు, సీహెచ్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


రికార్డులు పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త పద్మజ

వేపాడ: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త టి.పద్మజ మంగళవారం సందర్శించారు. రికార్డులను, వంట సరుకుల నిల్వలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. రోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థినులను ఆరా తీశారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఆమె అభినందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధచూపాలని చెప్పారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ టి.ఫ్లోరెన్స్ ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ శ్రీదేవి, ఎంపీడీఓ పద్మజ

కొత్తవలస: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి పిలుపునిచ్చారు. మండంలోని నిమ్మలపాలెం పంచాయతీ రాయపురాజుపేట గ్రామం నుంచి రైల్వే గేటు వరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యం ఎక్కువైపోయిందని, దీనిని అధిగమించేందుకు మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమన్నారు. ఉపాధిహామీ పథకం ఏపీఓ వై.జనార్దన్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో చెరువు గట్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ వై.పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, నిమ్మలపాలెం, అప్పన్నపాలెం సర్పంచ్‌లు కె.నిర్మలసాయి, కోన దేముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కె.ఎస్.ఆర్.పురంలో పశువైద్యశిబిరం

మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరం మండలంలోని కె.ఎస్.ఆర్.పురంలో పశుసంవర్ధక శాఖ ఏడీఏ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. 42పశువులకు పశువైద్య సిబ్బంది చూడిద తనిఖీలతో పాటు వివిధ వైద్యపరీక్షలు చేసి, చికిత్స అందజేశారు. పశువుల్లో కృత్రిమ గర్భధారణ పశుపోషణపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. తుమ్మికాపల్లి పశువైద్యుడు శశిభూషణరావు సర్పంచ్ కారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయం


గంట్యాడ: రామవరంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింట సర్వేలో ఎంపీపీ హైమావతి


బొండపల్లి: గొట్లాం సచివాలయంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ

గంట్యాడ: ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా వైద్యసిబ్బంది, వలంటీర్లు మంగళవారం చేపట్టిన ఇంటింటా సర్వేను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్కాగా సర్వే చేపట్టాలని వైద్యసిబ్బందికి సూచించారు. ప్రజల ఆరోగ్య వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. అనారోగ్యంతో ఉన్న వారిని త్వరలో నిర్వహించనున్న మెడికల్ క్యాంపులకు తీసుకువెళ్లి వైద్యం అందించనున్నామని తెలిపారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బొండపల్లి: ఈనెలాఖరు నుంచి గ్రామాల్లో నిర్వహించనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' మెడికల్ క్యాంపులను విజయవంతం చేయాలని, గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులను కోరారు. గొట్లాం గ్రామ సచివాలయంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి పల్లి రఘుతో పాటు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బొద్దల చిన్నంనాయుడు ఆధ్వ ర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారం సేకరించాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు పార్టీ తరఫున ఉచిత బీమా సౌకర్యాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, ఎంఎల్‌ఏ జి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో మార్చురీ నిర్మాణం

- ఎంపీ 'బెల్లాన' విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసిన ఐఓసీఎల్
- త్వరలో మార్చురీ గది, సోలార్ వాటర్‌ప్లాంట్ పనులు ప్రారంభం


చీపురుపల్లి సీహెచ్‌సీ

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) ఆవరణలో మార్చురీ గది నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్ఆర్)లో భాగంగా మార్చురీ గది నిర్మాణంతో పాటు రెండు ఫ్రీజర్లు, సోలార్ వాటర్ ప్లాంట్, ఇతర ఎక్విప్‌మెంట్ ఏర్పాటు కోసం దాదాపు రూ.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. సీహెచ్‌సీలో మార్చురీ గది లేకపోవడంతో పోస్టుమార్టం సమయంలో వైద్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) ఉన్నతాధికారులను కొంత కాలం క్రితం కలిసి ఇక్కడి సమస్యను వివరించి సీఎస్ఆర్‌లో భాగంగా మార్చురీ గది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఐఓసీఎల్ ప్రతినిధులు 2023 ఆగస్టు 24న పట్టణంలోని సీహెచ్‌సీని సందర్శించారు. అదే సమయంలో ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ ఇక్కడి పరిస్థితులను ఐఓసీఎల్ అధికారుల బృందానికి వివరించారు. మార్చురీ గది నిర్మాణానికి స్థలాన్ని అధికారులకు చూపించారు. దీంతో ఐఓసీఎల్ తాజాగా రూ.50 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. బిల్డింగ్ ప్లాన్, పంచాయతీ అనుమతులు సమర్పించిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిసింది.


గతనెలలో చీపురుపల్లి సీహెచ్‌సీలో స్థల పరిశీలనకు వచ్చిన ఐఓసీఎల్ అధికారులు బృందంతో ఎంపీ తనయుడు వంశీకృష్ణ(ఫైల్)

త్వరలో పనులను ప్రారంభిస్తాం..

ఢిల్లీలో పార్లమెంటు సమావేశాల్లో ఉన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ స్థానిక విలేకరులతో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. సీహెచ్‌సీ ఆవరణలో మార్చురీ గది నిర్మాణంతో పాటు రెండు ఫ్రీజర్లు ఏర్పాటు, సోలార్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఐఓసీఎల్ కంపెనీని గతంలో కోరామని చెప్పారు. న్నారు. సీఎస్ఆర్ పథకంలో భాగంగా ఐఓసీఎల్ రూ.50 లక్షలు వరకు నిధులు వెచ్చించేందుకు సిద్ధమని తమ అంగీకారాన్ని తెలుపుతూ తమకు సమాచారం ఇచ్చారన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

దత్తిరాజేరు: మండలంలోనిఎస్టీ కొత్తవలసకు చెందిన గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను విజయనగరంలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షికారుగంజి కొండపైన 60 గిరిజన కుటుంబాలు పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. కొండపైన నివాసం ఉండరాదని ఆటవీశాఖ అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ, తమను ఖాళీ చేయమని చెబుతున్నారని, సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు. ఉన్నతాధికారుల స్పందించి కొండకింద భాగంలో స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని చెప్పారని, ఆ హామీని తప్ప అమలు చేయలేదని గుర్తు చేశారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం


వలిరెడ్డి శిరీష, జెడ్పీటీసీ

చీపురుపల్లి: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌పై పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు ఆమోదం పొందడంతో మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే స్థానిక సంస్థలు, రాజకీయ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవులు నుంచి నామినేటెడ్ పదవుల వరకు మహిళలకు సముచిత స్థానం లభించిందన్నారు. సీఎం జగన్ బాటలోనే కేంద్ర ప్రభుత్వం కూడా మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు తీసుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.